'మెర్సీ తనకన్నా రెండేళ్ళు చిన్నది. అయినా పెద్ద ఆరిందాలా మాట్లాడుతుంది. తనమీద అధికారం చెలాయిస్తుంది. ఒటికీ మాటికీ తనను ఎద్దేవా చేస్తుంది. దీనికి అంతటికీ కారణం ఏమిటి?' జార్జికి ఏడుపు వచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. చొక్కాతో కళ్ళూ, ముక్కూ తుడుచుకున్నాడు.

ప్రతి శనివారంలాగానే ఆరోజు కూడా మెర్సీని ఎత్తుకుపోవడం కోసం ఎదిరిచూశాడు. ఉన్న రెండు జతల్లోనే ఒక జత శుభ్రంగా ఉతుక్కుని పక్కరోజు చర్చికి వేసుకువెళ్లటానికి అట్టే పెట్టుకోవటం మామూలు. మెర్సీ తనను ఉడికించింది. ముందుకు వస్తున్న దుఃఖాన్ని బిగపట్టుకున్నాడు.

"ఈ పేదవాడికి రోషం మాత్రం తక్కువలేదు" అంది మెర్సీ.

అలవాటు ప్రకారం కనుగుడ్లలోకి నీళ్ళవచ్చాయి. చొక్కా కొంగు ఇంకిపోయాయి తరకు కన్నీళ్లు తుడవటానికి ఒక స్నేహితుడు చొక్కా ... మాత్రానే ఉంటుంది. తను ఎన్ని బాధలు పడి అయినా సరే, అమ్మ చెప్పినట్లు నడుచుకోవాలి. ఆ నిశ్చయంతోనే, మెర్సీ ఎన్ని నిష్ఠూరాలాడినా సహించి ఎలా సాధించుకునేవాడు.

నిజానికి మెర్సీతో వాదించటానికి తనకు అర్హత ఏముంది? అమ్మ పోయిన తరవాత మెర్సీ వాళ్ళ నాన్న తనను వాళ్ళ ఇంట్లోనే ఉండమన్నాడు. వచ్చిన కొత్తలో మెర్సీ తనతో ఆడుకునేది కూడాను. రోజులు గడిచే కొద్దీ తనను ఒక పనివాడుగా చూడటం మొదలయింది.

"నీకు అమ్మా నాన్నా లేరు" అంటుంది మెర్సీ.

"నీకూ, నాకూ కనిపించదు తప్ప, ఎప్పుడూ మా అమ్మ నన్ను చూస్తూనే ఉంటుంది" అంటాడు తను.

అది చెప్పి, "కాదా, అమ్మా?" అంది వాళ్ళమ్మ చాటె ఒకరోజు ఆ అమ్మాయి.

వాళ్ల అమ్మ మెర్సీని ఒళ్ళోకి తీసుకుని ముద్దు పెట్టుకుంది.

ప్రాయం ఉండదు.

పిల్లల ఆటపాటలు, కోలాహలము చర్చి బయటనే ఆగిపోయాయి. భక్తి వాతావరణంలో బాల్యం, యౌవనం, వార్ధక్యం అనే భిన్న భావాలు లేవు. అందరి మనస్సులూ అత్యున్నతమైన దేనినో వెతుకుతూ మంచివైపు పయనిస్తాయి.

తదేకంగా జరిగిన ప్రార్థన అయిపోయిన తరవాత ఫాదర్ చెప్పటం మొదలుపెట్టారు:

"ఆయనమీద ప్రకృతి ఏమాత్రం తన ప్రభావం నెరపలేదు. ఆయన కాలపు ధర్మాలకు అతీతుడు. ప్రపంచంలో ప్రేమ, దయ, భక్తి ఎన్నాళ్ళ నిలిచిఉంటాయో అన్నాళ్ళ ఆయనా నిత్యంగా ఉంటాడు. భగవంతుడితో పాటు అనంతంగా జీవిస్తాడు. ఆయన బాలల భాగ్య విధాత—శాంటాక్లాజ్ మామయ్య."

ఆ పేరు చెప్పటంతో పిల్లలందరూ చెవులు రిక్కించి వినటం మొదలుపెట్టారు.

"ఆయన ఉత్తరధ్రువంలో అందమైన మంచు



అందుకే, చిసుగులు పడుతున్నా దాన్ని వదిలిపెట్టలేక పోతున్నాడు.

'ఈ బాధలు పడేకన్నా చర్చికి వెళ్లటమే మానేస్తే నయం!' అనిపించేది ఒక్కొక్కసారి. కానీ, అమ్మ ఎప్పుడూ మానేదికాదు. చచ్చిపోతూ అంత బాధలోనూ చెప్పింది కూడా—"నేను నీకు కనిపించను తప్ప ఎప్పుడూ నిన్నుమాత్రం చూస్తూనే ఉంటాను. పెద్దవాళ్ళకీ, దేవుడికీ భయపడాలి; భక్తి చూపించాలి" అని. అమ్మపడుతున్న బాధకే—కడుపులో దాచుకుంటే పేగులు తెగిపోతున్నట్లనిపించిన ఏడుపు వచ్చింది. ఒక్కసారి బావురుమన్నాడు. చొక్కాతో కన్నీళ్ళ తుడుచుకున్నాడు. అదే మొదటిసారి—ఊహ తెలిసిన తరవాత తను ఏడవటం. అమ్మ ఏ నిమిషాన అలా మాట్లాడి ఏడిపించిందో కానీ, ఆరోజునుంచి ఈరోజుదాకా ఏదో ఒక కారణంమీద అది తనను ఎడతెగకుండా అనుసరిస్తూనే ఉంది.

అమ్మ చెప్పినట్లు చెయ్యకపోతే? అమ్మో! అమ్మ

'నాకూ అమ్మ కనిపిస్తే ఎంచక్కా ఒళ్ళోవెళ్లి కూర్చుంటాను' అనుకున్నాడు జార్జి.

"ఆ సన్యాసితో నీకెందుకు? వెళ్లి ఆడుకోఅమ్మా!" అన్నది వాళ్ల అమ్మ సన్నగా నవ్వుతూ. ఏదో అర్థం చేసుకున్నట్లు గర్వంగా తనవైపు చూసి చెంగున వీధిలోకి వెళ్లింది మెర్సీ.

'అమ్మ ఎప్పుడూ అబద్ధం చెప్పదు. అమ్మ చెప్పిన మాట నమ్మరేం, ఈ పిచ్చివాళ్ళు!' అనుకున్నాడు జార్జి.

• • •

మనస్సును నిశ్చలంగా ఉంచటం నేర్చుకుంటే ఆనందాన్ని కొంగున కట్టుకున్నట్లే అని నేర్పుతాయి దేవాలయాలు. మనస్సు ఆలోచనలతో పెరుగుతుంది కాబట్టి దాన్ని ఒక మంచి విషయంలో లగ్నం చేస్తే కుండలో పెట్టిన దీపకళికలాగా ప్రశాంతంగా ఉంటుందని బోధిస్తాయి. సాధనంలో దృగ్గోచరం, మనోగోచరం అనే భేదం తప్ప సాధ్యంలో ఏ మతానికీ భిన్నాభి

ఇంట్లో ఉంటాడు. ఆయన ఉండే ఇల్లులాగే ఆయన మనస్సు ఎంతో చల్లగా ఉంటుంది. పిల్లలంటే ఆయనకు ఎంతో ముద్దు. అందరూ 'మామయ్య' అని పిలుస్తారు. పిల్లలు ఏమి కావాలన్నా ఇస్తాడు. అందమైన రథం ఎక్కివస్తాడు. మచ్చలున్న జింకలు ఆ రథానికి కట్టి ఉంటాయి. అవి ఎంత తొందరగా పరిగెత్తుతాయో! అవి పరిగెత్తుతుంటే గాలిలో తేలిపోతున్నట్లే ఉంటాయి తప్ప అసలు నేలమీద కాళ్ళ ఆనుతున్నట్లే అనిపించదు. చల్లని పండువెన్నెలలో ఆ రథం కదిలి పోతూ ఉంటే ఎంతో ముచ్చటగా ఉంటుంది. కానీ చూడాలంటే ఎవ్వరికీ కనిపించదు. ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళతాడో ఎవ్వరికీ తెలియదు. క్రిస్మస్‌నాటి రాత్రి వచ్చి పిల్లలు ఎవరు ఏవి కోరుకున్నా ఇచ్చిపోతాడు. వెళుతూ వెళుతూ 'హాపీ క్రిస్మస్! గుడ్‌నైట్' అని చెవిలో గుసగుసలాడతాడు. అంతలో అదృశ్యమైపోతాడు.

"ఈసారి క్రిస్మస్ పండుగకు ఎవరెవరికి ఏమేమి

**తిండి, బట్ట, ఉండడానికి అస్కారం లేనివారికి అంతకన్న కావలసినవి ఉండవు.**

**అన్నీ సమకూరినా మనుషులు సంతృప్తి చెందుతారని ఆశించడం తగదు. కాని దిక్కు లేనివారికి అన్నీ సమస్యలే. దేవుడే దిక్కు అని నమ్మకొనడం ఒక్కటే మార్గం.**

---

కావాలో నాకు వ్రాసి ఇవ్వండి. వ్రాయటం రాని పిల్లలు వాళ్ల వాళ్ల కోరికలు చెబితే నేను వాళ్ల మాటల్లోనే వ్రాసి మామయ్యకు పంపిస్తాను."

ఫాదర్ చెప్పటం పూర్తిచేశాడు. అందరి హృదయాలూ ఆనందమయమయ్యాయి. పిల్లలూ, వాళ్ల ఉత్సాహంలో పాలు పంచుకుంటూ పెద్దవాళ్లూ ఇళ్లకు బయలుదేరారు.

క్రిస్మస్ ఇంకా నెలరోజులు ఉన్నదనగానే పండుగ సంబరాలు వెల్లివిరుస్తున్నాయి. బజార్లన్నీ కొత్త కొత్త వస్తువులతో కళకళలాడుతూ ఉన్నాయి. ఎంతో అందంగా అలంకరించారు. ప్రతి కొట్టు కిటికీదగ్గరా ఒక్కో శాంటాక్లాజ్ మామయ్య వెలిశాడు. రంగు రంగుల దీపాల తోరణాలతో రాత్రులు సంతోషంలాంటి కాంతులతో వెలిగిపోతున్నాయి. కాస్త పెద్ద పెద్ద కొట్లమీద చక్కగా పెద్ద అక్షరాల అట్టలు కట్టాడు— మనం ఎదురు చూస్తున్న ఆనందం ఇంకో ముప్పై ఏ రోజుల్లోకి వచ్చింది అంటూ. రోజులు గడుస్తున్న కొద్దీ అంకెలు మారుతూఉన్నాయి.

ఇదంతా ఒక ఎత్తూ; ఒక్కొక్క ఇంటిలో కోలాహలం ఒక ఎత్తూను. మెర్సీ వాళ్ల అమ్మ ఆ అమ్మాయికి ఇంగ్లీషు అక్షరాలు నేర్పుతున్నది, ఫాదర్‌కు తన కోరిక వ్రాసి ఇవ్వటానికి. నెమ్మదిగా 'డాల్ సిస్టర్' అని వ్రాయటం నేర్చుకున్నది.

జార్జి ఆ అక్షరాలు చూశాడు. వంకరలు వంకరలుగా ఉన్నా ఎంతో ముద్దొస్తూ ఉన్నాయి. తను కూడా మామయ్యకు తన కోరిక తెలియజెయ్యాలి. కానీ తనకు చదువు రాదు. తనకు శ్రద్ధగా అక్షరాలు నేర్పే వాళ్లూ లేరు. 'అమ్మ ఉంటే తనకూ చక్కగా నేర్పించి ఉండేది' అనుకున్నాడు. మెర్సీ వాళ్ల అమ్మను అడిగితే నవ్వుల పాలవుతాడు. తను పనివాడు మాత్రమే. వాళ్లకు ఉన్న హోదా లేదు; డబ్బూ లేదు తనకు. అంతదాకా ఎందుకు? మెర్సీకి ఉన్నంత మంచి గుడ్డలే లేవు. ఆలోచిస్తూనే తను ఏమి అడగాలో కూడా నిశ్చయించుకున్నాడు.

● ● ● ●

కుండీలో గులాబీలు నవ్వుతూ అర్ధరాత్రికి స్వాగతమివ్వగా చల్లని క్రిస్మస్ వచ్చింది. ఆ శనివారం మాత్రం జార్జి తన చొక్కా, లాగూ ఉతుక్కోలేదు. మెర్సీవాళ్ల నాన్న ఒక జత కొత్త గుడ్డలు కుట్టించి ఇచ్చాడు. వాటితోనే చర్చికి వెళ్లి వచ్చాడు. రోజు అత్యానందంగా గడిచిపోయింది. పిల్లల పండుగ మిగిలిపోయింది— అర్ధరాత్రికోసం, మామయ్యకోసం ఎదురుచూడటం.

ఈ రాత్రి తెల్లవారితే తమ కోరికలు తీరుతాయి. ఈ చీకటి కాస్త వెళ్లిపోతే వెలుగు వస్తుంది.

తన సాక్స్ చక్కగా ఉతికించుకుని బట్టలు ఆరవేసుకునే తీగకు పిన్నులతో తగిలించుకుంది మెర్సీ. నిద్రపో బుద్ధివెయ్యటం లేదు. రోజూ చీకట్లోకి వెళ్లటానికి భయపడే మెర్సీ, ఏ మాత్రం చప్పుడయినా వంటింట్లోకి వెళ్లతున్నది. శాంటాక్లాజ్ మామయ్య పొగ గూటిలోనుంచి వచ్చి పిల్లలు అడిగినవి సాక్స్‌లో వేసి వెళతాడని వాళ్ల నాన్న చెప్పాడు. మామయ్య కోసం ప్రతీక్ష నిరంతరంగా సాగిస్తూనే ఉంది. తను శాంటాక్లాజ్ మామయ్యను తప్పక చూడాలి. కనిపించకుండా వెళ్లిపోనివ్వకూడదు. ఆలోచనలు కళ్లు మూశాయి.

తీగకు వేలాడదీయటానికి తనకు సాక్స్ లేవు. ఉన్నా, తను కోరుకున్నది సాక్సులో వెయ్యటానికి వీలయ్యేది కాదు. శాంటాక్లాజ్ మామయ్య రావాలి. తనకు కనిపించి దగ్గరకు తీసుకుని వాత్సల్యం కురిపించాలి. ఆ తరవాతే తన కోరిక తీరటం. ఏదో తెలియరాని ఉత్సాహంతో జార్జికి కూడా నిద్రపట్ట లేదు. కళ్లు మూసుకుని తియ్యగా ఊహించుకుంటూ పడుకున్నాడు. అంత చలిలోనూ కప్పుకోవాలనే భావనే లేదు జార్జికి. ఆలోచనలు వెచ్చగా పొదివి పట్టుకున్నాయి. మామయ్య ఎట్లా ఉంటాడో! అచ్చంగా మెర్సీ వాళ్లనాన్న చెప్పినట్లే ఉంటాడు—పండిపోయిన జుట్టూ, గడ్డం! కోటుకు పెద్ద పెద్ద జేబులు ఉంటాయేమో! అందరు అడిగిన వస్తువులూ వాటిలో వేసుకువచ్చి ఒక్కొక్కటే తీసి ఇస్తుంటాడు కాబోలు. లేదు. జేబుల్లో ఏమీ లేకుండానే కోరుకున్నవన్నీ అలా పుడుతూ ఉంటాయి. ఆలోచనలు తెగిపోయాయి. నెమ్మదిగా కళ్లు మూతలు పడ్డాయి. కలలు అలుముకున్నాయి.

మెర్సీ వాళ్ల నాన్న మెమ్మదిగా లేచాడు. నిశ్శబ్దంగా పెట్టెలోనుంచి ఒక చక్కటి బొమ్మ, బిస్కట్లపొట్లం తీశాడు. మెర్సీ పడుకున్న గదిలోకి వెళ్లి ఆ బొమ్మ రెండు చేతులూ రెండు సాక్సులోనూ దూర్చాడు. ఆ బొమ్మ కిందికి వేళ్లాడుతూ అందంగా ఉంది. చక్కగా, చల్లగా నవ్వుతూ ఉంది. ముద్దొచ్చేలా మెత్తని సిల్కు ఫ్రాకులో ఆనందంగా కనిపిస్తున్నది. అక్కడినుంచి పంచలోకి వెళ్లాడు. గోనెపట్టమీద చీర గుడ్డ పరుచుకుని ఆనందంగా కలలుకంటూ నిర్విచారంగా పడుకున్న జార్జిని చూశాడు. 'జార్జి ఏమి కోరుకున్నాడో తనకు తెలియదు. వాడి పసి హృదయం తల్లి కావాలని కోరుకున్నా కోరుకుని ఉండవచ్చు.' చేతిలో ఉన్న బిస్కట్ల పొట్లం పక్క పక్కనే పెట్టి వెళ్లిపోయాడు. జార్జిని చూస్తుంటే ఆయన కళ్లు ఆర్ద్రమయ్యాయి.

జార్జి అలవాటు ప్రకారం తొలికోడి కూతకే లేచాడు. పక్క ఎత్తుకోబోతూండగానే బిస్కట్లపొట్లం కనిపించింది. ఒక్క క్షణం ఉప్పొంగాడు. వెంటనే కుంగిపోయాడు. తను కోరుకున్నది అది కాదు. తను కోరినది తనకు లభించ దేమో? తెరలు విచ్చని చీకటిలా నిస్పృహ ఆవరించింది. అలానే గదిలోకి వెళ్లాడు. ముచ్చటగా నవ్వు ముఖంతో రమ్మని పిలుస్తున్నది బొమ్మ. వెంటనే మెర్సీని లేపాడు.

మెర్సీ లేచింది. బొమ్మ చూసింది. కళ్లు నులుముకుని మరొక్క సారి చూసింది. హృదయం విప్పారింది. "నాన్నా!" అని ఆనందం పట్ట లేనంతగా ఒక్క కేక వేసింది. "ఏమమ్మా" అని పలకరిస్తూ వాళ్ల అమ్మ వచ్చింది. "మామయ్య వచ్చాడు. నాకు 'డాల్ సిస్టర్'ని ఇచ్చాడు" అంటూ చేతులు చాచింది. ... ఇచ్చింది వాళ్ల అమ్మ. మెర్సీ ముఖం వికసించింది. బొమ్మను ఎత్తుకుని జార్జిని చెయ్యి పుచ్చుకుని పంచలోకి లాక్కు వెళ్లింది.

'పండుగ పొద్దున్న శుభాలు తెచ్చి ఇస్తుంది. నిజం! తనకోరికా తీరవచ్చు.' ఆ ఆశాకిరణం జార్జి ఆలోచనల్లో దూరింది.

త్వరత్వరగా తయారై అందరూ చర్చికి వెళ్లారు. ఆ రోజు ప్రార్థన తరవాత పిల్లలందరికీ చర్చి ఆవరణలో మిఠాయిలు పంచి పెట్టారు.

వెళ్లిపోతూండగా మెర్సీవాళ్ల నాన్నను పిలిచాడు



దయాసాగరుడు

చిత్రం—శెట్టి కిరీటి (విజయపురి దక్షిణం)

ఫాదర్. మెర్సీ, వాళ్ల నాన్న, అమ్మ, జార్జి ఆయనను ఇంటికి అనుసరించారు. అక్కడ ఒకాయన ఉన్నాడు. నెరిసిపోయిన గడ్డం. తలమీద వెన్నెల విదిలించినట్లు జుట్టూ, కను బొమలూ కూడా తెల్లగా ఉన్నాయి. ముఖం చూస్తే దయ, శాంతి స్థిరనివాసం ఏర్పరుచుకున్నట్లున్నది. కళ్లలో ప్రేమ పెల్లుబుకుతున్నది.

"ఆయనతో వెళతావా?" జార్జిని అడిగాడు ఫాదర్.

"ఎందుకు?" బిక్కు బిక్కుమంటూ సగం మాట నోటిలోనే ఉండిపోగా అన్నాడు జార్జి.

"శాంటాక్లాజ్ మామను నువ్వేదో ఇమ్మని కోరుకున్నావుగా? అది ఇస్తాడు."

నోట మాటలేకుండా ఒక్క క్షణం అలానే రెప్ప వెయ్యకుండా ఆయన ముఖంలోని చూశాడు జార్జి.

ఫాదర్ అది గమనించి అన్నాడు: "ఆయనే

**పాలపర్తి వేణుగోపాల్**

మామయ్య."

తండ్రి వెనక నక్కుతూ నిలుచున్న మెర్సీ ముందుకు వచ్చింది.

"ఆయనే మామయ్య." మళ్ళీ అన్నాడు ఫాదర్.

'తన కోరిక ఫాదర్‌కు చెప్పినప్పుడు ఆశ్చర్యంతో వింతగా విప్పారాయి ఆయన కళ్ళు. జార్జికి అర్థంకాని ఒక చిరునవ్వు నవ్వుకున్నాడు. అది వేరే కాగితంమీద వ్రాసుకుని జార్జి పేరూ, అడ్రెసూ వ్రాసుకున్నాడు!' జరిగిన సంఘటన జార్జికి గుర్తు వచ్చింది. ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేశాడు. "నిజం! నిజంగా ఇస్తావా?" ఆ పేరు వినటంతోటే ఏదో ఆప్యాయత పొంగివచ్చింది.

ఆయన ముఖం ఎంతో ప్రసన్నంగా ఉంది. ముఖం మీద వెల్లివిరిసే చిరునవ్వు అన్నిటికీ సమాధానం చెబుతున్నది. లాలిస్తున్నట్లు దగ్గిరికి తీసుకుని, "ఊఁ" అన్నాడు. ఆయన తాకితే వాత్సల్యం ప్రవహించినట్లు శరీరం జల్లుమన్నది.

"సరే" అని ఎంతో ఉత్సాహంగా అని మెర్సీ వాళ్ల నాన్న వైపు బెరుకుగా చూశాడు జార్జి.

ఆయనకు ఇదేమీ అర్థం కాలేదు. తెల్లబోయాడు. గుడ్లప్పగించి నిలుచున్నాడు.

"విశేషాలు తరవాత ఉత్తరం వ్రాస్తారు. జార్జిని వారితో పంపించండి" అన్న ఫాదర్ మాటలకు ఎదురు చెప్పలేకపోయాడు.

రెండు రోజులు గడవకుండానే అనుకున్న ఉత్తరం వచ్చింది. ఉత్సుకతతో చదవటం మొదలు పెట్టాడు ఆయన:

"నమస్కారాలు.

"మీ కుటుంబంలోని ముగ్గురికీ జార్జి తన నమస్కారాలు అందజెయ్యమన్నాడు."

ఉత్తరం చదువుతున్న ఆయన ఒళ్ళు పులకలతో నిగిర్చింది. కళ్ళు అప్యాయతతో కూడిన ఆనందం కురిశాయి.

"జీవితం పేరు తెలియని పూలతీగ. చిన్నప్పుడు ఆ పసి మనసులలో కలిగే భావాలే పెద్ద అయిన తరవాత వారు వెదజల్లే సువాసనలకు మూలం. వారి ఊహాలు పూలు పూయటంకోసం చేసే నిరంతర నిరీక్షణలో మాధుర్యం ఉంది—వారికే కాదు; పెద్దవాళ్లకూను. బాహిరప్రభావాలకు లోనుగాని ఆ లేత హృదయాలు దేనికోసం అర్రులు చాచుతూ ఉంటాయో; జీవితపు పందెంలో దేన్ని అందుకోవాలని, ఏమి సాధించాలని పరుగులు పెడుతూ ఉంటాయో దానినుంచి వారి అభ్యుదయం గుర్తించవచ్చు. నాకు సంతృప్తి కలిగించే ఒక్క పిల్లవాడి కోరిక అయినా సంపూర్ణంగా నెరవేరుద్దామని నా ఆశయం. దానికోసం ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్నాను. ఇప్పటికైనా అది సాధ్యమైనందుకు నేనెంతో పొంగిపోతున్నాను. అందరు పిల్లల లానే జార్జి కూడా ఒక కోరిక కోరుకున్నాడు. అతనిలోని అమాయకత, స్వచ్ఛత, పట్టుదల నన్ను ముగ్ధుణ్ని చేశాయి. మీ అంగీకారంతో అతన్ని నా దగ్గిరే అట్టిపెట్టుకో దలుచుకున్నాను. ఇన్నాళ్ళూ అతని రక్షణ భారం వహించినందుకు కృతజ్ఞుణ్ని.

"మరిచిపోయాను—అతను ఫాదర్ చేత వ్రాయించిన కోరిక ఇది: 'చదువు. చదువు. చాలా చాలా పెద్ద చదువు. గొప్ప చదువు. చెప్పిస్తావు కదూ, మామయ్యా?' " ★


